యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - మల్కాపురం: యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణులు సి.హెచ్.దుర్గా మల్లేశ్వర్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన సదస్సులో మాట్లాడారు. యువత తెలియని లింకులను, ఇ- మెయిల్స్‌ను ఉపయోగించ కూడదని అన్నారు. సైబర్ భద్రత కోసం పాస్వర్డ్ క్లిష్టంగా ఉండేలా చూసుకోవాలని, అనుమానంగా ఉండే మెయిల్స్‌కు, ఫోన్ కాల్స్‌కు సమాధానాలు ఇవ్వకూడదని, యాంటీ వైరస్‌ను ఏర్పరచుకో వాలన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి కూడా సైబర్ భద్రతపై ప్రసంగించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై

ప్రభుత్వాల వైఖరి దుర్మార్గం

- టిడిఆర్ బాండ్లు, కోడి వ్యర్థాలపై అట్టుడికిన కౌన్సిల్
- స్మార్ట్ సిటీ పేరిట జీవీఎం సంస్థలు తాకట్టు అన్యాయం
- రోజంతా అజెండా-1 అంశంపైనే చర్చ.. అయినా వాయిదా...

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: కొన్ని నెలలు తర్వాత శుక్రవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం రోజంతా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై, టిడిఆర్ బాండ్లు జారీపై, కోడి వ్యర్థాలు చేపల చెరువుకు తరలింపుపై, జీవీఎంసీ ఆస్తులను స్మార్ట్ సిటీ పేరిట తాకట్టు పెట్టడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి రోజంతా చర్చించారు. సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ అంటూ వామపక్ష, వైసీపీ కార్పొరేటర్లు ప్లే కార్డులతో నినాదాలు చేసి మేయర్ పోడియం వద్ద బైఠాయించి నిరసనలు చేపట్టారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరిగింది. దాదాపు గంటన్నర పాటు స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై సభ్యులంతా మండిపడ్డారు. జీవీఎంసీకి విశాఖ స్టీల్ ప్లాంట్ ఆయువు పట్టుగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2,200 కోట్లు, కేంద్రానికి రూ.2,700 కోట్ల పన్నుల ద్వారా చెల్లిస్తుందన్నారు. ఇటీవల 46 విభాగాలను విభజించి ముక్కలుగా చేసి, బడా కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేసిందని వెంటనే ఈ టెండర్‌ను రద్దు చేయాలని సభ్యులు ఆందోళన చేపట్టారు. 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, మరో 5 వేల మందిని తొలగించేందుకే ఈ విభాగాలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనకుంటున్నారని మండిపడ్డారు.

అనంతరం జీవీఎంసీలో టీడీఆర్‌ల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. అక్రమంగా టీడీఆర్లు జారీ చేయడంలో అప్పటి చీఫ్ సిటీ ప్లానర్‌గా పనిచేసిన ఆర్.విద్యుల్లతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం ఎంవివి ఎంకేలో శ్మశాన స్థలాలను ఆక్రమించి తప్పుడు ప్లాను ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోకుండా, ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించకపోయినా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బిల్డింగ్ కూల్చివేతలో విద్యుల్లత కీలక పాత్ర పోషించారని ఆమెపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. మురికివాడల పేరిట తప్పుడు పత్రాలతో టీడీఆర్‌లు పొందారని, రేవల్లపాలెం, వెంకటపతి రాజు నగర్, జోగారావు నగర్‌లో టిడిఆర్‌లు మంజూరుపై అవకతవకలు విచారణ జరపాలని కోరారు. సింహాచలం రహదారి విస్తరణలో వెంటనే బాధితులకు టిడిఆర్‌లు ఇవ్వాలని ఆ వార్డు కార్పొరేటర్ కోరారు. దువ్వాడ రహదారి విస్తరణ, ఎండాడ రహదారి విస్తరణ, మ్యారెట్ హోటల్ వద్ద రహదారి విస్తరణలో పేదలకు టిడిఆర్ బాండ్లు ఇవ్వకుండా తిప్పుతున్నారని సభ్యుల ఆగ్రహం వ్యక్తం చేశారు.

అలాగే కోడి వ్యర్థాలు డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా, చేపల చెరువులకు తరలించి ప్రజల ఆరోగ్యాలను హరిస్తున్నారని వెంటనే కాంట్రాక్టర్ల ఆగడాలను అధికారుల అవినీతిని అరికట్టి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. స్మార్ట్ సిటీ పేరుతో విశాఖలో విలువైన ఆస్తులను తాకట్టు పెడుతున్నారని, వామపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్కోస్‌లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించడం లేదని పలువురు సభ్యులు నిలదీశారు. నీటి సరఫరా పనుల నిర్వహణపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 40 అంశంగా ఉన్న వీధి విక్రయదారులకు టౌన్ వెండింగ్ కమిటీలో ఉన్నవారు నాలుగేళ్ల క్రితం వారే అని పలువురు కార్పొరేటర్లు వ్యక్తం చేశారు. జీవీఎంసీపై కేసు పెట్టిన వారిని కమిటీలో వేస్తారా? నైట్ ఫుడ్ బజార్‌లో లక్షల రూపాయలు వసూళ్లు చేస్తున్నారని, 9 మందితో ఉన్న కమిటీని రద్దు చేయాలని సభ్యులు కోరారు. నిజమైన నిరుపేద వీధి వ్యాపారులను కమిటీ సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశారు. జోన్‌లో వేసిన స్ట్రీట్ వెండింగ్ కమిటీలో అందరికీ ప్రాతినిధ్యం కల్పించాలని సభ్యులు కోరారు. స్వీపింగ్ మిషన్ నిర్వహణకు రూ.12 కోట్లు 60 లక్షలతో మెకానికల్ విభాగంలో ఓ కాంట్రాక్టర్ లబ్ధి కోసమే రెండు ఏళ్లకు టెండర్ పిలిచారని, ఆ కాంట్రాక్టర్‌ను అన్నిచోట్ల నిషేధించారని జీవీఎంసీలోనే అధికారులు మామూలుగా కక్కుర్తికి ఆశపడి లబ్ధి చేకూర్చుతున్నారని ఆరోపించారు. మెకానికల్ విభాగంలో అవినీతిపై సభ్యులు ప్రశ్నించారు. ప్రధాన అజెండా 84 అంశాలు ఉండగా, టేబుల్ అజెండాలో మరో 67 అంశాలు ఉన్నాయి. వీటిలో 3 మొదటి అజెండాలో వాయిదా పడగా, టేబుల్ అజెండాలో అన్ని ఆమోదం పొందాయి. రాత్రి 8:00 వరకు సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు మాత్రమే హాజరయ్యారు. మిగతా ఎమ్మెల్యేలు, ఎంపీలు కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాలేదు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కార్పొరేటర్లు నిరసన

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో వైసీపీకి చెందిన కార్పొరేటర్లు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా "విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు" పేరుతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు, నల్ల వస్త్రాలు ధరించి జీవీఎంసీ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం మీటింగ్ హాలుకు వెళ్ళి మేయర్ పోడియం వద్ద బైటాయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటమూరి సతీష్, పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్ రావు, కార్పొరేటర్లు అక్కరమణి పద్మ - రాము నాయుడు, దౌలపల్లి ఏడుకొండలరావు, కోరుకొండ వెంకట రత్న స్వాతి దాస్, అక్కరమని రోహిణి, కటారి అనిల్ కుమార్, మొల్లి లక్ష్మీ, నక్కిల లక్ష్మి, సాడి పద్మారెడ్డి, పల్లా అప్పల కొండ, బిపిన్ కుమార్ జైన్, తోట పద్మావతి, చెన్న జానకి రామ్, గుండాపు నాగేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకట రమణ, బర్కత్ అలీ, కె.వి.శశికళ, గులిగిందల లావణ్య, పి.వి.సురేష్, బల్లా లక్ష్మణ్, మహమ్మద్ ఇమ్రాన్, గుడివాడ సాయి అనూష లతీష్, ఉరుకూటి రామచంద్రరావు (చందు), భూపతి రాజు సుజాత, మాడపాటి సునీత, జాజుల ప్రసన్న లక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ.షరీఫ్, ఫాతిమా రాణి, సేనాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రను విజయవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సామాజిక కార్యకర్తలు సమష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఆగస్టు నెల థీమ్ "వర్షాకాలం పరిశుభ్రత"కు అనుగుణంగా కార్యలాపాలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఆయా మండల స్పెషల్ ఆఫీసర్లు దగ్గరుండి కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా అత్యంత పరిశుభ్రత పాటిస్తూ.. ఉత్తమ రీతిలో కార్యకలాపాలు నిర్వహించే వారికి రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛ అవార్డులు కూడా ఇవ్వనుందని పేర్కొన్నారు. ఉత్తమ మున్సిపాలిటీ, ఉత్తమ గ్రామ పంచాయతీ, ఉత్తమ పాఠశాల, ఆసుపత్రి, రైతు బజార్, పరిశ్రమ, బస్టాండ్, పట్టణంలో అయితే స్వచ్ఛ వారియర్స్ పేరుతో, గ్రామీణంలో అయితే గ్రీన్ అంబాసిడర్స్ పేరుతో అవార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నెల నాలుగో శనివారం నిర్వహించే కార్యక్రమాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయా కార్యాలయాలు, గృహాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రెయిన్లను శుభ్ర పరచాలని చెప్పారు.

శంకర్ ఫౌండేషన్‌లో ప్రభుత్వ వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించడంలో పేరుగాంచిన జీవీఎంసీ 93వ వార్డు, నాయుడుతోట వద్ద గల శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ అండ్ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అల్లైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్‌చే గుర్తించబడిన వృత్తివిద్యా కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగారు రాజు తెలిపారు. హెల్త్ కేర్ కోర్సులు పూర్తిచేసిన వారికి దేశంలోని అనేక హాస్పిటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. ఇంటర్ ఏ గ్రూపులోనైనా ఉత్తీర్ణులైన విద్యార్థులు, రెండు సంవత్స రాలు వ్యవధి గల డిప్లొమో ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ కోర్సు, డిప్లొమో ఇన్ ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు, డిప్లొమో ఇన్ ఆప్టో మెట్రీ టెక్నీషియన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఇంటర్ బైపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాలు వ్యవధి గల బీఎస్సీ ఆప్టో మేట్రీ చేసేందుకు అర్హులన్నారు. వివరాలకు 91210 05933, 99635 82130కు సంప్రదించాలన్నారు.

పాలియేటివ్ కేర్‌పై జిమ్సర్‌లో శిక్షణ

విశాలాంధ్ర - మధురవాడ: తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారికోసం ప్రత్యేకమైన వైద్య సంరక్షణను ముఖ్యంగా శారీరక, మానసిక, సామాజిక ఒత్తిడులను దూరం చేసే విధంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్)లోని స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో విద్యార్థులకు పాలియేటివ్ కేర్ (ఉపశమన సంరక్షణ)పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిమ్సర్ ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తూ ఆధునిక వైద్య విధానంలో పాలియేటివ్ కేర్ ప్రాధాన్యతను వివరించారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేషన్ బాలు, శిక్షణ కార్యక్రమ కోఆర్డినేటర్ టి.మాలతి పాల్గొని పాలివేటివ్ కేర్‌పై వివిధ అంశాలు గురించి వివరించారు. కార్యక్రమంలో హెూమిబాబా కేన్సర్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విద్య విశ్వనాథ్, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ వి.పావని, గాయత్రి విద్యా పరిషత్ సైక్రియాట్రి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రావణి, గీతం నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.ఉషా పాల్గొని పాలివేటివ్ కేర్‌కు సంబంధించిన వివిధ అంశాలను వివరించారు.

64 కేసుల్లో 66 మంది అరెస్టు

రూ.1,20,58,150/- విలువైన ఆస్తి స్వాధీనం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలై-2025లో వివిధ ఆస్తి నేరాల విభాగాల కింద మొత్తం 101 ఆస్తి నేరాల కేసులు నమోదు కాగా 64 కేసులు ఛేదించామని నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన రికవరీ మేళా లో ఆయన పాల్గొని రికవరీ సొత్తును బాధితులకు అందజేశారు. జూలైలో డీసీపీ(క్రైమ్స్) పర్యవేక్షణలో 64 కేసులను గుర్తించామని, వివిధ విభాగాల కింద 66 మంది నేరస్థులను అరెస్టు చేసి రూ.83,08,150/- విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పైన పేర్కొన్న ఆస్తితో పాటు, రూ.37,50,000/- విలువైన 250 తప్పిపోయిన మొబైల్‌లను కూడా స్వాధీనం చేసుకున్నామని, మొత్తం రూ.1,20,58,150/- విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. గుర్తించబడిన 64 కేసుల్లో, 2 దోపిడీ కేసులు, 4 పగటిపూట హెచ్‌బి కేసులు, 11 హెచ్‌బిలు బై నైట్ కేసులు, 1 స్నాచింగ్ కేసు, 2 కార్ దొంగతనాలు, 1 ఆటో దొంగతనం కేసు, 19 మోటార్ సైకిల్ దొంగతనాలు, 5 వైర్ దొంగతనాలు, 1 పిపి కేసు మరియు 18 సాధారణ దొంగతనాలుగా తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో రికవరీ సాధనలో క్రైమ్ పోలీసులు ప్రతినెలా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ(క్రైమ్స్) లతా మాధురి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం వ్యవస్థ ఏర్పాటుకు వినతి

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి పంచాయతీ కూటమి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ పంచాయతీలో ఐదువేల మందికి పైగా జనాభా ఉండడంతో సచివాలయం సిబ్బంది సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో మరో సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని పంచాయితీ మాజీ సర్పంచ్ యరబాల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ టీడీపీ పార్టీ ప్రెసిడెంట్ యరబాల ఆనంద్, మాజీ వైస్ సర్పంచ్ అదపాక మురళీకృష్ణ, టీడీపీ నాయకులు యస్.శ్రీనివాస్, యం.అప్పలరాజు, పద్మ, జనసేన సీనియర్ నాయకులు గుడివాడ కిరణ్, వార్డు మెంబర్‌లు పాల్గొన్నారు

అప్పన్నకు బంగారు గొలుసు విరాళం

విశాలాంధ్ర - సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారికి శ్రీకాకుళంకు చెందిన శ్రీ లక్ష్మీనరసింహ మోటార్స్, వైశ్యరాజు రాజారాం కిరణ్ రాజ్ తమ భక్తి భావంతో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారికి సుమారు 49 గ్రాముల బరువైన శంఖం, చక్రనామాలతో 6 పేటల బంగారు చైనును కానుకగా అందజేశారు. ఈ విరాళం ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధా, ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాస్ ఆచార్యులు, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు సమక్షంలో స్వామివారికి సమర్పించారు. ప్రముఖ బుల్లితెర యాంకర్ అనసూయ తమ కుటుంబ సభ్యులతో సింహాద్రి నాధుని దర్శించు కున్నారు. సామూహిక వరలక్ష్మీ వ్రతములు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు దంపతులు, ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు ప్రారంభించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో గాయత్రి విద్యార్థులు సత్తా

విశాలాంధ్ర - ఆనందపురం: గాయత్రి డిగ్రీ కాలేజ్ విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో, గాయత్రి విద్యార్థులు శాత శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రధానాచార్యులు దుక్క అప్పలరాజు శుక్రవారం ప్రకటించారు. విద్యార్థులు 9.3, 9.2, 9.1 గ్రేడ్ పాయింట్లతో మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల కృషిని అభినందిస్తూ, వారిని మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బెల్లనా రామకృష్ణ, టి.పద్మ, డి.రాజేశ్వరి, ఎస్.భారతి, కే.సోమేశ్వర్, సిహెచ్.నరహరి, బి.సునీత, జి.లక్ష్మణ్, ఎస్.ప్రియాంక, గౌరీ దుర్గ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైవే స్థలాల విక్రయాలు

వ్యాపారులకు నిత్యం ఇబ్బందులు

విశాలాంధ్ర - ఆనందపురం: వేములవలస జంక్షన్ సర్కిల్ వద్ద నేషనల్ హైవే పరిధిలో స్థలాల అమ్మకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ సమయంలో పోయిన షాపుల యజమానులకు కేటాయించిన స్థలాలను కొందరు ఆక్రమించి లక్షల్లో డబ్బులు తీసుకుని విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు వైపులా షాపులు పెట్టుకుని జీవనోపాధి సాగిస్తున్న చిన్న వ్యాపారులకు కొత్త చిక్కులు తలెత్తాయి. షాపులకు వెళ్లే రహదారి మధ్యలో అక్రమంగా కొత్త షాపులు నిర్మించడం వల్ల చివరలో ఉన్న వ్యాపారులకు దారి లేకుండా పోతుంది. రెండు నుంచి మూడు లక్షల రూపాయలకు ఈ స్థలాలు అమ్ముతున్నారని స్థానికులు చెబుతున్నారు. నేషనల్ హైవే స్థలాలను క్రయవిక్రయాలు జరపడం చట్టరీత్యా నేరమని తెలిసినా, కొందరు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు అయితే బలంగా వినిపిస్తున్నాయి. పేదవారు చిన్న షాపులు వేసుకుని జీవనోపాధి కొనసాగించే పరిస్థితుల్లో, దారి మధ్యలో షాపులు కట్టేయడం వారికి గుండెలపై రాయిగా మారింది. ఈ విషయంపై స్థానిక వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే హైవే అధికారులు జోక్యం చేసుకుని అక్రమ విక్రయాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని హైవే స్థలాలను రక్షించాలని కోరుతున్నారు.

క్రీడా హబ్‌గా విశాఖ: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - కొమ్మాది: విశాఖను క్రీడా హబ్‌గా తీర్చి దిద్దుతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కొమ్మాది ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి మాదిరిగా విశాఖలో కూడా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కొమ్మాదిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శ్రీకారం చుట్టారన్నారు. కొమ్మాదిలో 22 ఎకరాల్లో రూ.200 కోట్లతో ఈ దివ్యాంగుల స్టేడియం నిర్మించనున్నామని వెల్లడించారు. క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, క్రీడాకారులను ఆర్థికంగా ఆదుకోవడానికి సి.ఎస్.ఆర్. నిధులు, దాతల సాయాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు, శాప్ డైరక్టర్లు బుచ్చిరాజు, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, అర్జున అవార్డు గ్రహీతలు నీలంశెట్టి లక్ష్మి, ఎంవీ మాణిక్యాలరావు, ఎస్.జయరాం సహా విశాఖకే చెందిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు పూజారి శైలజ, కనకదుర్గ, పుణ్యవతి, హరి కమల్, కంచర్ల సూర్యనారాయణ, ప్రతాప్ కుమార్, సాయి సంహిత, వి. దేవుళ్లను గంటా శ్రీనివాసరావు, రవి నాయుడు సన్మానించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ఐశ్వర్య లక్ష్మి అమ్మవారి శోభాయాత్ర

విశాలాంధ్ర - భీమిలి: భీమిలీ శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర దివ్య క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ఐశ్వర్య లక్ష్మీ అమ్మవారికి శ్రావణ మాస ఆఖరి శ్రావణ శుక్రవారం, 108 దివ్య కలశాలతో భక్తులు శోభా యాత్ర చేపట్టారు. ఆలయ అర్చకులు పురాణం శేషాచార్యులు, అర్చక బృందం వారిచే ఘనంగా జరిగింది. అనంతరం అశేషంగా పాల్గొన్న భక్త జనులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐశ్వర వేంకటేశ్వర ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, హరనాథరెడ్డి, వి.తాతాజీ పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు అండగా టీడీపీ

విశాలాంధ్ర - తగరపువలస: జీవీఎంసీ 1వ వార్డ్ పరిధిలో గల నాయి బ్రాహ్మణ కుటుబాలు తమ జీవనోపాధి చేసుకున్న హెయిర్ కటింగ్ షాపులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 200 యూనిట్లు వరకు విద్యుత్ చార్జీలు మినహాయింపు విషయంపై నాయి బ్రాహ్మణులు ఫస్ట్ వార్డ్ అధ్యక్షులు తమ్మిన సూరిబాబుని కలిశారు. వెంటనే స్పందించి సంబంధించిన ఎలక్ట్రికల్ ఏఈని కలిసి పై విషయంపై చర్చించి వాటికి కావలసినటువంటి పత్రాలు గురించి వివరణ ఇచ్చి ఒక నెల రోజుల్లో తగరపువలస పరిధిలో గల హెయిర్ కటింగ్ షాపులు అన్నిటికీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటువంటి విద్యుత్ మినహాయింపు పథకాన్ని షాపులు ఉన్నటువంటి అందరికీ వర్తించేలా చేస్తామని హామీఇచ్చారు.

టైగర్ రిజర్వ్‌ను పరిరక్షించేందుకు ఐసీఐసీఐ ఫౌండేషన్ మద్దతు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఐసీఐసీఐ బ్యాంక్ యొక్క సీఎస్ఆర్ విభాగమైన ఐసీఐసీఐ ఫౌండేషన్, నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్)లోని వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునిచ్చేలాపలు చర్యలు చేపట్టింది. దేశంలోనే అతి పెద్దదైన ఈ టైగర్ రిజర్వ్, ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల కొండల్లో 3,725 చ.కి.మీ. మేర విస్తరించి ఉంది. బెంగాల్ పులులు, ఇతరత్రా అంతరించిపోతున్న జాతుల పరిరక్షణను మెరుగుపర్చేందుకు 2023 నుంచి అటవీ శాఖ అధికారులతో ఐసీఐసీఐ ఫౌండేషన్ కలిసి పని చేస్తోంది. పర్యావరణ పునరుద్ధరణతో పాటు క్షేత్ర స్థాయిలో అడవిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా తోడ్పాటు అందిస్తోంది. సీజనల్‌గా వన్యప్రాణులకు తలెత్తే నీటి కొరత సమస్యను పరిష్కరించేందుకు, రిజర్వ్‌వ్యాప్తంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ 34 కృత్రిమ నీటి చెలమల నిర్మాణానికి తోడ్పాటు అందించింది. అలాగే 130 హెక్టార్లలో పచ్చికబయళ్లు

అభివృద్ధి చేయబడ్డాయి. స్థానిక వృక్షజాతులనుపెంచేందుకు, శాకాహారి ప్రాణులు మరియు ఇతరత్రా జాతులకు ఆరోగ్యకరమైన ఆవాసాన్ని పెంపొందించేందుకు తోడ్పాటు అందించబడుతోంది. కార్చిచ్చుల నిర్వహణ, నివారణ కృషిలో భాగంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ 100 ఫైర్ బ్లోయర్లు, 75 గ్రాస్ కట్టర్లు విరాళంగా అందించింది. ఎండు అడవి ప్రాంతాలను నిర్వహించేందుకు, వేసవి నెలల్లో కార్చిచ్చుల వ్యాప్తిని నివారించేందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ సాధనాలను ఉపయోగిస్తోంది. వన్యప్రాణి సంరక్షణ, పెట్రోలింగ్ కూడా అప్‌గ్రేడ్ చేయబడ్డాయి. అటవీ జోన్లలో మొబిలిటీ మరియు నిఘాను మెరుగుపర్చేందుకు ఐసీఐసీఐ ఫౌండేషన్ అయిదు పెట్రోలింగ్ వాహనాలను విరాళంగా అందించింది.

గణేష చతుర్థి స్టోర్‌ను ప్రారంభించిన అమేజాన్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: రానున్న వినాయక చవితి పండుగ పురస్కరించుకొని అమేజాన్ ఇండియా అమెజాన్ డాట్ ఇన్ లో ప్రత్యేకమైన గణేష చతుర్థి స్టోర్‌ను ప్రారంభం గురించి ఈరోజు ప్రకటించింది. పర్యావరణా నుకూలమైన, సంప్రదాయబద్ధమైన పండగ అవసరాలు యొక్క ఆలోచనాత్మకంగా కూర్చిన ఎంపికను కస్టమర్లకు అందిస్తోంది. పండగను ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థిరంగా జరుపుకోవడానికి ఈ స్టోర్ లో బంక మట్టితో చేసిన వినాయకుడి విగ్రహాలు మరియు చేతితో తయారు చేసిన అలంకరణలు, పండగ దుస్తులు, పూజకు అవసరమైన వస్తువులు, మిఠాయిలు అన్నీ లభిస్తాయి. ఉత్పత్తులు కనుగొనడానికి, వ్యక్తిగత సిఫారసులు పొందడానికి, తమ పండగ షాపింగ్ అనుభవాన్ని మెరుగువరచడానికి కస్టమర్లు అమేజాన్ వారి ఏఐ పవర్డ్ షాపింగ్ అసిస్టెంట్ రూఫస్‌ను కూడా వాడవచ్చు. గణేష చతుర్థి అనుభవాన్ని మెరుగువరచడానికి పండగ అలంకరణ కోసం తప్పనిసరిగా ఉండవలసిన వస్తువులపై 90 శాతం వరకు తగ్గింపు, పర్యావరణానుకూలమైన బంకమన్ను విగ్రహాలు, మూర్తీలు మరియు డీఐవై కిట్స్‌పై 80 శాతం వరకు తగ్గింపు, పూజా అవసరాలుపై 80 శాతం వరకు తగ్గింపు, స్టైలిష్ సుస్థిరమైన ఫ్యాషన్ ఎంపికలపై 80 శాతం వరకు తగ్గింపు, లడ్డూలు, డ్రై ఫ్రూట్స్, ఇంకా ఎన్నో వంటి పండగ విందులు మరియు మిఠాయి బాక్స్‌లపై 60 శాతం వరకు తగ్గింపు, హ్యాండీక్రాఫ్టర్ వస్తువులపై కూడా తగ్గింపు ధరలతో ఉన్నాయని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు.

జనసేన ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు జనసేన పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ మెగాస్టార్ కొణిదల చిరంజీవి 70వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆనందోత్సాహాలతో భారీ కేకను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి పిఏసిఎస్ చైర్మన్ అయితే సింహాచలం, నియోజవర్గం సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ చైర్మన్ వేగి దివాకర్, సీనియర్ నాయకులు గంగు నాయుడు, కరణం కనకారావు, పెందుర్తి అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ గొర్రెపిల్లి స్వామి నాయుడు, డైరెక్టర్లు ఆర్ఎస్ నాయుడు, గొంఠిన హైమావతి, సంతోష్ కుమార్, పిఏసిఎస్ డైరెక్టర్ ఉగ్గిన అచ్చిబాబు, మండల పార్టీ అధ్యక్షులు కోరుపోలు రామునాయుడు, వార్డు అధ్యక్షులు డిబిఎల్ నాయుడు, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, అక్కిరెడ్డి నరసింహమూర్తి, గండి దుర్గాప్రసాద్, గండి నాగభూషణం, గొర్ల అప్పారావు రమేష్, శ్రీనివాసరావు, ఎర్రి బాబు, రాపర్తి కిషోర్, రాపర్తి నందు తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డు సమస్యలపై కార్పొరేటర్ మొల్లి వినతి

విశాలాంధ్ర - మధురవాడ: ఐదవ వార్డ్‌లో దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టాండింగ్ కమిటీ మెంబర్ కార్పొరేటర్ మొల్లి హేమలత జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా వార్డు పరిధిలో గల మారికవలస జాతీయ రహదారి నుండి ఐటీ సెజ్‌కు వెళ్ళే రోడ్లో రాత్రి పూట చీకటిగా ఉండడం వలన త్రాగుబోతులు, మత్తు పదార్థాలు సేవించే వారు ఆ రోడ్డులో ప్రయాణించే వారిని ఇబ్బందులకు గురిచేయడం జరుగుతుందని కావున ఆ రోడ్డులో త్వరితగతిన సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, వార్డు పరిధిలో గల ప్రధాన కూడలిలో 10 రింగ్ పోల్ లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, కొండవాలు ప్రాంతాల్లో క్రొత్త విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని, అలాగే మారికవలస ప్రధాన రహదారిని విస్తరించి పునఃనిర్మించాలని, బోరవానిపాలెంలో అంతర్గత రహదారులు వేయాల్సిందిగా, సాయిరాం కాలనీ, శివశక్తినగర్ సర్వే నెంబర్ 27 కొండవాలు ప్రాంతాలలో రోడ్లు, కాలువలు, మెట్లు మార్గాలు ఏర్పాటు, పార్కులు, శ్మశాన వాటికలు ఆక్రమణకు గురికాకుండా త్వరితగతిన అభివృద్ధి చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

మేయర్ వైఖరిపై కూటమి కార్పొరేటర్ల ఆగ్రహం

మేయర్ వైఖరిపై ఆవేదన వ్యక్తం చేస్తున్న బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత

మేయర్ మాటల దురుసుతనంపై టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు అసహనం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: గత కొన్ని నెలల క్రితం కూటమి పార్టీల సహకారంతో మేయర్ గా ఎన్నికైన పీలా శ్రీనివాస్ రావు వైఖరి పై కూటమి పార్టీ కార్పొరేటర్లు తీవ్రంగా విభేదిస్తున్నారు. కౌన్సిల్ సమావేశాలు వేదికగా సొంత పార్టీ కార్పొరేటర్లే ఆయన మాట ధోరణిపై మండిపడుతున్నారు. ఏక వచనంగా, కనీస గౌరవం లేకుండా కార్పొరేటర్లను కించపరిచేలా మేయర్ గా ఉన్నాను అన్న అహంతో శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారని అనేక మంది కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కౌన్సిల్ సమావేశంలో అదే జరిగింది. టిడిపి కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ కు మేయర్ కు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. బీజేపీ ఫ్లోర్ లీడర్ గ%శీ%కల కవిత తో ఇదే తరహా లో వాగ్వివాదం చోటుచేసుకుంది. మహిళని చూడకుండా మేయర్ మాట్లాడారని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అవగాహన లేకుండా అంతరహితంగా అహంతో మాట్లాడుతున్నారని అనేకమంది కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అందుకే ఇటీవల స్థాయి సంఘం ఎన్నికల్లో వైసిపికి ఒక స్థానం లభించిందని కూడా కొంతమంది అంటున్నారు. అధికారులపై కూడా దురుసుగా మాట్లాడుతున్నారని, ఆయన చెప్పిందే శాసనంగా చేయాలని వాదిస్తున్నారని అనేకమంది అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేయర్ పిఏ పైడిరాజు అధికారులపై పెత్తనం చేస్తున్నారని అనేక మంది ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. టిడిపి పెద్దలు మేయర్ వైఖరి పై దృష్టి చారించకపోతే భవిష్యత్తులో కూటమి పార్టీ లో తీవ్ర నష్టం చవి చూడాల్సి వస్తుందని పలువురు కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

తుఫానుకు గురైన వరి పొలాల పరిశీలన

విశాలాంధ్ర - పద్మనాభం: భీమిలి సబ్ డివిజన్ పరిధిలో అధిక వర్షాల ప్రభావానికి గురైన వరి పొలాలను వ్యవసాయ శాఖ అధికారి చలం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అనకాపల్లి కీటక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విశాలాక్షి, మృతిక శాస్త్ర శాస్త్రవేత్త డాక్టర్ ఏ.శిరీష, కొక్కిరావల్లి శాస్త్రవేత్త డాక్టర్ ఏబీయం.శిరీష, పద్మనాభం వ్యవసాయ అధికారి చలం కలిసి వరి పొలాలను సందర్శించారు. శాస్త్రవేత్తలు రైతులకు సూచించిన మార్గదర్శకాలు చేశారు. పొలాల్లో నిల్వ నీటిని వెంటనే బయటకు వదిలేయాలని, వరి పిలక దశలో ఉండటంతో, నీరు తీసిన వెంటనే ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. విలాస్ ఖాన్ పాలెం, మద్ది, పద్మనాభం, పొట్నూరు గ్రామాల్లోని వరి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవీఎస్ చలం, వ్యవసాయ శాఖ సిబ్బంది, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, వీఏఏ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్తా చాటిన కెఆర్ఎస్ఎ అకాడమీ క్రీడాకారులు

మినీ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన మధురవాడ స్కేటర్లు

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడ సమీపంలో ఉన్న కెఆర్ఎస్ఎ అకాడమీ అండర్ రవి కుమార్ స్కేటింగ్ క్రీడాకారులు మినీ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తమదైన సత్తాని చాటి మెడల్స్ ప్రశంస పత్రాలను కైవసం చేసుకున్నారు. ఈనెల 9, 10 తేదీలలో నగరంలో వుడా పార్కు స్కేటింగ్ రింక్‌లో నిర్వహించిన మినీ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధురవాడ వుడా కాలనీ సమీపంలో శిక్షణ పొందుతున్న కెఆర్ఎస్ఎ అకాడమీ నుండి క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇందులో భాగంగా 6 నుండి 8 సంవత్సరాల బాలికల విభాగంలో జెస్సికా రింక్ 1లో సిల్వర్ మెడల్, రింక్ 3లో బ్రాంజ్ మెడల్,రింక్ 2లో శాన్వి సిల్వర్ మెడల్ సాధించారు. 8 నుండి 10 సంవత్సరాల బాలుర విభాగంలో చరణ్ జీత్ రింక్ 1లో సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే 10 నుండి 12 సంవత్సరాల బాలికల విభాగంలో కుసుమ రింక్ 1లో సిల్వర్, రింక్ 3లో బ్రాంజ్ మెడల్ సాధించింది. 12 నుండి 15 సంవత్సరాల బాలికల విభాగంలో వైష్ణవి రింక్ 2లో, మాస్ రెస్‌లో సిల్వర్ మెడల్స్, సేవిత హర్షిణి మాస్ రెస్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. అంతే కాకుండా ఇషాంత్, రేహిత, అర్జున్, చేతన్ యాషిక,హన్విక స్కేటింగ్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రాలను కైవసం చేసుకున్న క్రీడాకారులను అకాడమీ కోచ్ వి.రవి కుమార్, తల్లిదండ్రులు అభినందించారు.

జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

విశాలాంధ్ర - కొమ్మాది: మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలను ఆలయ అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ, రాంబాబు శర్మ, మూర్తి శర్మలు తదితరులు నిర్వహించి కర్పూర హారతి నీరాజన మంత్ర పుష్పం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా మధురవాడ చంద్రంపాలెం వాస్తవ్యులు సత్యాల కనకారావు కుమారులు సత్యాల మనోజ్ కుమార్, దాక్షాయణి దంపతులు ఏర్పాటు చేసిన పులిహోర ప్రసాదం అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. మధురవాడ చంద్రంపాలెం వాస్తవ్యులు, శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు పొట్నూరి హరికృష్ణ, రోహిణి దంపతులు, కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో ఆలయంలో మూడు వందల మంది భక్తులకు, పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదుర్గాలమ్మ ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఉప కోశాధికారి దుక్క వరం, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోతిన శివ, జాయింట్ సెక్రటరీ పిళ్లా మోహన్ శివకృష్ణ, కమిటీ సభ్యులు పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, గూడేల రాజు, బోగవిల్లి రాము, పొట్నూరి హరికృష్ణ, కేశనకుర్తి అప్పారావు, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పీస రామారావు, ముఖ్య సభ్యులు పిళ్లా పోతరాజు, పిళ్లా రాము, జగుపిల్లి అప్పారావు, పిళ్లా అప్పన్న, , పిళ్లా అప్పారావు, వాండ్రాసి అప్పారావు, పోతిన రమణ, సుందర శ్రీను, దుక్క అప్పారావు, పొట్నూరి వాసు, శంకాబత్తుల శ్రీను, రమేష్ గుప్తా పాల్గొన్నారు.

అమర్ చిత్ర కథ, టింకిల్‌కి చెందిన ఐకానిక్ సుపండితో జట్టు కట్టిన ట్రాన్స్‌యూనియన్ సిబిల్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతీయ క్రెడిట్ వ్యవస్థపై విశ్వసనీయతను పెంపొందించేందుకు కృషి చేస్తున్న అగ్రగామి ఇన్‌సైట్స్, ఇన్ఫర్మేషన్ కంపెనీ ట్రాన్స్‌యూనియన్ సిబిల్,ఒక ప్రముఖ స్టోరీటెల్లింగ్ ఆధారిత బ్రాండ్‌తో జట్టు కట్టడంతో పాటు మరియు వినియోగదారుల ప్రచార కార్యక్రమంతో తమ 25వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. సిబిల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా సుసంపన్న సాంస్కృతిక వారసత్వం, గణనీయమైన ప్రాచుర్యంతో తరతరాలుగా భారతీయులను అలరిస్తున్న అమర్ చిత్ర కథతో కలిసి 'సిబిల్ కీ కహానియా' పేరిట లెజెండరీ టింకిల్ కామిక్ బుక్ స్పెషల్ ఎడిషన్ రూపొందింది. ఇందులో చిరపరిచితమైన టింకిల్ క్యారక్టర్ సుపండితో పాటు ఆర్థిక పరిజ్ఞానం గల సిమ్రన్ అనే కొత్త ఫ్రెండు, అలాగే సిబిల్ స్కోరును వ్యక్తిరూపంలో ప్రతిబింబించే మైసిబిల్ అనే మరో క్యారెక్టరు, వెరసి రెండు కొత్త పాత్రలు ఉంటాయి. రుణ కాన్సెప్టులపై అపోహలు తొలగిస్తూ, క్రెడిట్ బ్యూరో పాత్ర, అలాగే రుణ అలవాట్లు ఏ విధంగా సిబిల్ స్కోరును ప్రభావితం చేస్తాయనే వివరాలను సరదాగా, ఒక కథ చెబుతున్న రీతిలో వివరించేదిగా ఇది ఉంటుంది. ఈ మూడు పాత్రలు కలిసి రుణాలకు సంబంధించిన వివరాలను సులువుగా అర్థమయ్యే విధంగా తెలియజేస్తాయి. సుపండి కథలను చదువుతూ పెరిగిన పెద్దవారితో పాటు ఇప్పుడిప్పుడే ఆర్థిక ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్న యువత వరకు అన్ని వర్గాల వారికి రుణాలపై అవగాహన కల్పించే విధంగా ఈ ఎడిషన్ ఉంటుంది. సుపండి మరియు అతని స్నేహితుల 'సిబిల్ కీ కహానియా' స్పెషల్ ఎడిషన్‌ని చదివేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ సిబిల్ డాట్ కామ్ ను సందర్శించవచ్చు.

జగన్‌కి సిగ్గు లేదా: ప్రియాంక దండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వైసీపీ అధినేత ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సిగ్గు లేదా అని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి విమర్శించారు. తమ నాయకుడు స్వర్గీయ వై ఎస్ రాజశేఖరరెడ్డి జీవితాంతం బీజేపీకి వ్యతిరేకంగా పోరాడితే, ఆయన రాజకీయ వారసత్వాన్ని తీసుకుని జగన్ బీజేపీతో అంటకాగుతున్నాడని, వైఎస్ఆర్ ఆత్మ గోషిస్తోందని ఆమె అన్నారు. రాష్ట్రంలో టీడీపీ మీద ఓంటి కాలు మీద లేచే వైసీపీ కేంద్రంలో టీడీపీ ఉన్న ఏన్‌డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థికి ఎలా మద్దతు ఇస్తారని ఆమె ప్రశ్నించారు. వైసీపీ నాయకుడు శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ వైసీపీ స్టాండ్ స్పష్టం చేసారని. స్టీల్ ప్లాంట్ విషయం తేల్చండి, ప్రత్యేక హోదా ఇవ్వండి, విభజన హామీలు అమలు చేయండి మద్దతు ఇస్తాను అని రాష్ట్ర ప్రయోజనాల దృశ్య కండిషనల్ మద్దతు తెలిపిన రాష్ట్ర ప్రజలు అభినందించేవారన్నారు. బీజేపీ కుట్రలో భాగంగా ఓటు చోరీతో ఆంధ్రప్రదేశ్ లో కూటమి అధికారంలోకి వచ్చిందని తెలిసినా సిగ్గు లేకుండా ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలుగు వాడు, తమ సామాజికవర్గం వాడైన ఆయనకి కాకుండ ఏన్ డి ఏ కూటమి అభ్యర్థికి మద్దతు తెలపడంతో జగన్ వై ఎస్ ఆర్ పేరుకి మచ్చ తీసుకువచ్చారని , వైసీపీ లో ఉన్న వై ఎస్ ఆర్ అభిమానులు ఒక్కసారి ఆలోచించాలన్ననారు .జగన్ నిర్ణయాల వల్ల వైఎస్ఆర్ ఆత్మ క్షోభిస్తుంటే ఇంక అదే పార్టీలో ఉంటారా అని ప్రియాంక ప్రశ్నించారు.

వేములవలసలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంప్

విశాలాంధ్ర - ఆనందపురం: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వేములవలస హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంప్ నిర్వహించారు. రెండు వారాలకుపైగా దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నవారు, 60 ఏళ్లు పైబడినవారు, ధూమపానం అలవాటు ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ క్యాంపులో స్క్రీనింగ్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది స్క్రీనింగ్‌కు హాజరయ్యారు. వీరిలో 20 మందికి కఫం నమూనాలు సేకరించి టెస్టులు నిర్వహించారు. క్యాంపులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎంపీ హెచ్ఈఓ శ్యామలరావు, హెచ్ వి పార్వతమ్మ, మధురవాడ టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్వైజర్ వీరబ్రహ్మం, సిహెచ్ఓ సూర్యకళ, సురేష్, ఇసాక్ ,తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి అప్స నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - పెందుర్తి: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ పెందుర్తి నియోజకవర్గం కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. పెందుర్తి బాలాజీ స్కూల్‌లో జిల్లా నాయకులు మురళి మనోహర్, మూర్తి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో అప్స పెందుర్తి ప్రెసిడెంట్‌గా బిఎస్ రావు, సెక్రటరీగా ఎం.రాంప్రసాద్, ట్రెజరర్‌గా ఎస్.రమణ ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గం ఆధ్వర్యంలో పెందుర్తి ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధి జరగాలని జిల్లా నాయకులు మురళి మనోహర్, మూర్తి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అప్స ప్రతినిధులు నాగేశ్వరావు, నానీ, మురళి ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పులగాని పాలెం గ్రామానికి చెందిన రొంగలి అప్పలనాయుడు (49) మతిస్థిమితం సరిగా లేకుండా, గత నెల 7న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ లభించలేకపోవడంతో అతని భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ కే.వీ.సతీష్ కుమార్ తెలిపారు. ఎవరైనా సదరు తప్పిపోయిన వ్యక్తి గూర్చి ఆచూకీ తెలిసిన యెడల, వెంటనే 9676797314, 9985340890 నెంబర్లకు సమాచారం అందించవలసిందిగా కోరారు.

చిప్పాడ హైస్కూల్‌ను సందర్శించిన ఆర్డీఓ

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్ శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆయన పాఠశాలలో గల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరువట్టీలను పరశీలించారు. అలాగే పాఠశాలకు చెందిన వివిధ రికార్డులను కూడా పరశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనశాలకు వెళ్లి ఆహార పదార్థాలు రుచిగా ఉన్నాయా లేదా అని విద్యార్థులను అడిగారు. ఆయన భోజన పదార్థాలను రుచి చూసారు. అనంతరం ఆయన ఉన్నత పాఠశాల నూతన భవనంలోకి మారిన దృష్ట్యా పాఠశాల ప్రాంగణంలో మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎం.శివరాణి, డొకర శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.విజయ్ కుమార్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూలోకమాత ఆలయం వద్ద భారీ అన్నదానం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం హైస్కూల్ సమీపంలో భూలోకమాత ఉత్సవాలు శుక్రవారం విజయవంతంగా ముగిశాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో సుమారు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆనందపురం లోడగల వాని పాలెం, బీపీ కల్లాలు, వేములవలస, నేలతేరు తదితర గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈసారి ఉత్సవాలను గ్రూపులు లేకుండా ఐక్యంగా నిర్వహించడం విశేషమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ప్రతి సంవత్సరం రెండు వర్గాలుగా నిర్వహించే ఉత్సవాలను ఈ ఏడాది అందరూ కలిసికట్టుగా నిర్వహించడం ప్రశంసనీయమని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్వి పాలెం సర్పంచ్ లోడగల రాజేశ్వరి, రమణ, చందక జనార్దన్ రావు, మీసాల సత్యనారాయణ, చందక సూరిబాబు,మాజీ సర్పంచ్ శ్రీనాథ్ నారాయణరావు, ఉపసర్పంచ్ ఈగల నాగరాజు, పార్టీ అధ్యక్షుడు ఎల్. సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ లోడగల వెంకట్రావు, మాజీ ఉపసర్పంచ్ కంచుబోయిన శ్రీను,ఉత్సవ కమిటీ సభ్యులు కంచుబోయిన పైడిరాజు, అప్పల రాము, శ్రీను గంగులు తదితరులు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించి, భక్తులకు అన్నదానం అందించారు.